

వివరాలు మెయిన్‌లో

చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

గురువారం | 29 అక్టోబరు , 2026 | పేజీలు : 5

మానవ హక్కుల కేసుల పట్ల
నల్లగొండ జిల్లా యంత్రాంగం స్పందన భేష్

గత ఏడాదితో పోలిస్తే గణనీయంగా తగ్గిన హెచ్ఆర్సి కేసులు

హెచ్ఆర్సి చైర్‌పర్సన్ జస్టిస్ షమీమ్ అక్తర్



ప్రజాపక్షం/నల్లగొండ : మానవ హక్కుల కేసుల పట్ల జిల్లా యంత్రాంగం స్పందన అద్భుతంగా ఉందని,గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది జిల్లా నుంచి హెచ్ఆర్సికి వచ్చే ఫిర్యాదులు గణనీయంగా తగ్గాయని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ అన్నారు. బుధవారం జిల్లా పర్యటనలో భాగంగా ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించిన అనంతరం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలోని ఎమర్జెన్సీ,ఐసీయూ,యూడీఐడీ కేంద్రాలను సందర్శించి సౌకర్యాలను పరిశీలించారు.అనంతరం మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో అధికారులు బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తున్నారని,ఈ ఏడాది ఇప్పటివరకు కేవలం 5 కేసులు మాత్రమే హెచ్ఆర్సి కి వచ్చాయని, వాటికి కూడా వెంటనే స్పందించి నివేదికలు సమర్పించారని తెలిపారు. గత ఏడాది 45 నుంచి 50 కేసులు రాగా ఒక్క కేసు తప్ప మిగతా అన్నింటినీ పరిష్కరించారన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా గతంలో 17 వేల కేసులు పెండింగ్ లో ఉండగా 15 వేలకు పైగా పరిష్కరించామని, ప్రతిరోజూ 40 నుంచి 50 కేసులు వస్తున్నాయని, అందులో విద్య, ఆరోగ్యం, భూములు, సీనియర్ సిటిజన్స్, పోలీసు,రెవెన్యూ కేసులు ఉంటున్నాయని చెప్పారు.ప్రభుత్వ ఆసుపత్రి సందర్శనలో రోజూ 1200 మంది అవుట్ పేషెంట్లు,700 మంది ఇన్ పేషెంట్ల సామర్థం ఉందని, నెలకు 800 ప్రసవాలు జరుగుతున్నాయని, అందులో 60 సాధారణ ప్రసవాలు,40 సిజేరియన్ లు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో అశోక్ రెడ్డి, డీఎంహెచ్ఓ డాక్టర్ రాహుల్, ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నాగేష్ పాల్గొన్నారు.

ప్రజలకు సేవలు అందించడమే అధికారుల పరమావధి

ప్రజలకు సేవలు అందించడమే పరమావధిగా అధికారులు పనిచేయాలని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ అన్నారు.బుధవారం జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్,జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్,జిల్లా అధికారులతో సమావేశమై వివిధ అంశాలపై సమీక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ హక్కుల కమిషన్ కేసుల పట్ల నల్లగొండ జిల్లా యంత్రాంగం తక్షణ స్పందన అభినందనీయమన్నారు. జిల్లా ,రాష్ట్ర వ్యాప్తంగా వివిధ శాఖల అధికారుల సహకారం బాగుందని ప్రశంసించారు. విద్య, వైద్యం, భూములు, సీనియర్ సిటిజన్స్,పోలీస్,రెవెన్యూ తదితర కేసులతో పాటు సుమోటో కింద కొన్ని కేసులను స్వీకరించి పరిష్కరిస్తున్నామని తెలిపారు. విద్య,వైద్యం విషయంలో అనేక కేసులు వస్తున్నాయన్నారు.



తుఫాను భయంతో ముందస్తు వరి కోతలు

ప్రారంభం కాని ఐకేపీ సెంటర్లు..ప్రైవేట్ మిల్లు వద్ద బారులు తీరిన వడ్ల ట్రాక్టర్లు

ప్రజాపక్షం/మునుగోడు : తుఫాన్ ప్రభావంతో వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులు మండల రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. వర్షాలు కురిసి చేతికొచ్చిన పంట తడిసిపోతుందనే భయంతో పలువురు రైతులు వరి కోతలను ముందుగానే ప్రారంభించారు.అయితే ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర పొందేందుకు వీలుగా మండలంలో ఎక్కడా కొనుగోలు కేంద్రాలను (ఐకేపీ సెంటర్లు) అధికారులు ఇంకా ఏర్పాటు చేయకపోవడంతో రైతు లు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో వివిధ గ్రా మాల రైతులు తమ ధాన్యాన్ని మండల కేంద్రంలోని ప్రైవేట్ మిల్లులో అమ్మేందుకు వడ్ల లోడ్లతో ట్రాక్టర్లలో భారీగా తరలిపస్తున్నారు. ఒకేసారి పెద్ద సంఖ్యలో ట్రాక్టర్లు రావడంతో ధాన్యం దిగుమతికి ఆలస్యమవుతోందని రైతులు వాపోతున్నారు. గంటల తరబడి ట్రాక్టర్ల వద్దే వేచి ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిల్లు వద్ద ధాన్యం దిగుమతి ప్రక్రియను వేగవంతం చేసి,రైతులు ఎక్కువసేపు వేచి ఉండకుండా చర్యలు తీసుకోవాలని, ధాన్యం నిల్వకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు కొనుగోలు ప్రక్రియలో జాప్యం లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

దేవాదాయ, రెవెన్యూ శాఖల విచారణ

సరళ మైసమ్మ దేవాలయాన్ని ఎండోమెంట్‌కు తీసుకునే విషయం పరిశీలన

ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం: గత కొన్ని రోజులుగా సరళ మైసమ్మ దేవాలయం వద్ద కొనసాగుతున్న వివాదాన్ని పరిష్కరించేందుకు దేవాదాయ, రెవిన్యూ శాఖ సంయుక్తంగా బుధవారం విచారణ నిర్వహించారు. సంస్థ నారాయణపురం మండల పరిధిలోని రాచకొండ రెవిన్యూలో ఉన్న సరళ మైసమ్మ దేవాలయం కమిటీ వివాదం గత కొన్ని రోజులుగా కొనసాగుతూ శాంతిభద్రతల సమస్యగా మారింది. అందులో భాగంగానే పోలీసులు ఈ వివాదం శాంతిభద్రతల సమస్యకు దారితీస్తుందని ఇట్టి సమస్యను పరిష్కరించేందుకు సరళ మైసమ్మ దేవాలయాన్ని దేవాలయ శాఖ పరిధిలోకి తీసుకునేలా సహకరించాలంటూ ప్రభుత్వానికి సిఫారసు చేశారు. దీనిపై విచారణ నిర్వహించేందుకు నల్లగొండ దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ బృందంతోపాటు చౌటుప్పల్ ఆర్డీవో సంయుక్తంగా విచారణ చేపట్టారు. ఈ సమయంలో దేవాలయంలో బహిరంగంగా హుండీలు ఏర్పాటు చేసి భక్తుల నుండి అర్చన వివిధ రూపాల పేరిట డబ్బులు వసూలు చేస్తున్న విషయాన్ని గమనించారు. అంతేకాకుండా సరళ మైసమ్మ దేవాలయాన్ని ప్రభుత్వ భూమిలో నిర్మించి వివాదాలను సృష్టించడం పై అధికారులు కాస్తంత ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఇరువర్గాలను వాదనలు విన్న దేవాదాయ, రెవెన్యూ శాఖ అధికారులు జిల్లా కలెక్టర్ తో పాటు దేవాదాయ శాఖ కమిషనర్ కు నివేదిక అందజేస్తామని తెలిపారు. అక్కడే స్థానికంగా ఉన్న కొందరు భక్తులు రాచకొండ రెవిన్యూ నారాయణపురం మండల పరిధిలో సరళ మైసమ్మ దేవాలయం ఉన్న అల్లాపురం గ్రామం అని ఏర్పాటు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వీటన్నిటిని పరిశీలించిన అధికారులు పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు నివేదించి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. చౌటుప్పల్ డిఎస్పి మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. వారి వెంట నారాయణపురం మండల దేవాదాయ శాఖ ఈవో వెంకటరెడ్డి, స్థానిక డిప్యూటీ తాసిల్దారు మమత, ఆర్ఐ పాండు, చౌటుప్పల్ రూరల్, టౌన్ సిఐలు మన్మధ కుమార్, సతీష్ రెడ్డి, స్థానిక ఎస్సై సీత పాండు తదితరులున్నారు.





మూసీ నీటిని క్రమబద్ధీకరించాలి

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ ; మూసి నీటిని క్రమ బద్ధీకరించి రైతాంగానికి రెండో పంటకు నీరు అందిం చాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మల్లు నాగార్జున్ రెడ్డి కోరారు. బుధవారం తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో మూసి ప్రాజెక్టు ఎస్సి నాగభూషణ రావుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూసీ ప్రాజెక్టు ద్వారా నీరు ఎక్కువ మొత్తంలో విడుదల చేయటం వల్ల రెండవ పంటకు సాగునీరు అందే పరి స్థితి ఉండదని దీని మూలంగా రైతాంగం రెండవ పంటకు సాగునీటికి ప్రమాదం ఉందని ప్రభుత్వం తక్షణమే మూసీ నీటిని క్రమబద్ధీకరించి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలం గాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్య దర్శి మట్టిపల్లి సైదులు, రైతు సంఘం జిల్లా నాయ కులు వీరబోయిన రవి, వెల్పుల వెంకన్న, వెలుగు మధు పాల్గొన్నారు.

బిఆర్ఎస్‌లో చేరికలు



ప్రజాపక్షం/నేరేడుగొమ్ము; కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, వెయ్యి రోజులు గడుస్తున్నా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని దేవరకొండ మాజీ ఎంఎల్‌సి రమావత్ రవీంద్రకుమార్ విమర్శించారు. 2028 ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ గెలుపొంది మళ్లీ ముఖ్యమంత్రి కేసీఆర్ అవుతారని ఆయన తెలిపారు. బుధవారం దేవరకొండ పట్టణంలోని పార్టీ కార్యాల యంలో నేరేడుగొమ్ము మండలం కాచరాజు పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని బీచ్యానాయక్ తండాకు చెందిన పలువురు మాజీ ఎంఎల్‌సి రవీంద్రకుమార్ సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వా నించారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయ కులు బాలు, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.


ఆర్థిక సాయం

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: యాద్గార్పల్లి: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యాద్గార్పల్లి గ్రామానికి చెందిన పగిళ్ల ప్రశాంత్ కుటుంబానికి సీహెచ్ఆర్ (చింతరెడ్డి ఫౌండేషన్) తరఫున బుధవారం నల్గొండ జిల్లా రైతు బంధు సమితి మాజీ అధ్యక్షులు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రశాంత్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దుండిగాల శ్రీనివాస్, ఉప సర్పంచ్ సుధాకర్, నాగేందర్, బంటు యల య్య, చిమట ఆంజనేయులు, కొండేటి రవి, శ్రీధర్‌తో పాటు ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.



కోతుల గుంపులతో ఆందోళన









ఇళ్లపైకి విధుల్లోకి గుంపులుగా వస్తున్న కోతులు

ప్రజాపక్షం/నడిగూడెం: గ్రామీణ ప్రాంతాల్లో కోతుల బెడద రోజు రోజుకు పెరుగుతుండటంతో గ్రామ స్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గుంపు లుగా గ్రామాల్లోకి ప్రవేశిస్తున్న కోతులు ఇళ్లలోకి చొర బడి ఆహార పదార్థాలు ఎత్తుకెళ్తూ ఇళ్లపైన ఉన్న వస్తు వులను చిందర వందర చేస్తున్నాయని గ్రామాల్లోని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విధుల్లో, రోడ్ల వెంట ఉండే కోతుల గుంపులు ప్రయాణికుల వెంట పడి ప్రాణాల మీదకు తెస్తున్నాయని వాపోయారు. కోతుల వల్ల మండలంలో అనేక బైకు ప్రమాదాలు జరిగి కాళ్లు, చేతులు విరిగిన వాళ్లు లేకపోలేదని అన్నారు. కోతుల దాడుల వల్ల మృత్యువాత పడ్డవారు చాలమంది ఉన్నారని ఆరోపిస్తున్నారు. వీధుల్లో సంచ రించే కోతుల వల్ల పిల్లలు, వృద్దులు బయటకు వెళ్లా లంటే భయపడుతున్నారని మండలంలో వివిధ గ్రామాల ప్రజలు తెలియజేస్తున్నారు. కొన్ని చోట్ల వరి పొలాల్లో, పండ్ల తోటల్లో కోతుల గుంపులు పడి రైతులను నష్ట పరుస్తున్నాయని ఇంతా జరుగుతున్నా అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని తెలిపారు. రైతులు కోతుల గుంపులను తరిమివేటా నికి ప్రయత్నిస్తే ఎదురుదాడి చేస్తున్నాయని రైతులు ఏమీ చేయాలో తెలియక అయోమయ పరిస్థితిలో ఉన్నారని తెలిపారు.

అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలి కోతుల బెడదను అరికట్టేందుకు సంబంధిత అధికా రులు తక్షణమే స్పందించాలని మండల ప్రజలు కోరు తున్నారు. కోతులను సురక్షితంగా పట్టుకుని అటవి ప్రాంతాలకు తరలించడానికి చర్యలు చేపట్టాలని అధి కారులకు ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

డిసెంబర్ 1న 'రుద్రసహిత కాలభైరవ మహాయజ్ఞం'



ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ ; హిందూ ధర్మంలో ప్రతి హిందువు సంవత్సరానికి ఒక్కసారైనా యజ్ఞం, వ్రతం నిర్వహించాలని వేదాలు చెబుతున్నాయని ఏ హోమము, వ్రతాలు చేయలేని భక్తజనులు, పేదల కోసం శ్రీబాల మానస మహా విద్యాపీఠం ఆధ్వ ర్యంలో డిసెంబర్ 1న జిల్లా కేంద్రంలో శ్రీరుద్ర సహిత కాలభైరవ మహాయజ్ఞం నిర్వహిస్తున్నట్లు పీఠా ధిపతులు శ్రీశ్రీశ్రీ లక్ష్మి నారాయణ సద్గురు భవాని స్వామీజి తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని యర్రంశెట్టి ఉపేందర్ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యజ్ఞంకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. యజ్ఞ యాగాదుల ఖర్చులు రోజురోజుకు పెరుగుతున్నాయని ఆ ఖర్చులను భరిం చలేక యజ్ఞాలు యాగాలు కుంటుపడుతున్నాయ న్నారు. సమాజ శ్రేయస్సు కోరి మానవ కర్మలను తొలగించేందుకు యజ్ఞాలను నిర్వహిస్తున్నట్లు వివ రించారు. అందులో భాగంగా డిసెంబర్ 1న 1116 మంది దంపతులచే జిల్లా కేంద్రంలోని తిరుమలనగర్ రోడ్డు నంబర్ 24, అమ్మ గార్డెన్ ఎదురుగా నిర్వహిం చబోతున్నట్లు తెలిపారు. ఈ యజ్ఞంలో పాల్గొనే వారు రూ.1516లు చెల్లించి హోమంలో పాల్గొనే అవకా శాన్ని తమ ట్రస్టు కల్పిస్తుందన్నారు. కౌన్సిలర్ షేక్ జహీర్, నాయకులు సలిగంటి వీరేందర్, యర్రంశెట్టి ఉపేందర్ తులసి, సంకురిశెట్టి పరమేష్ సబిత, ప్రసాదు, వాసుదేవరావు పాల్గొన్నారు.

పాఠశాలలో ఇ-వేస్ట్ సేకరణకు ప్రత్యేక ఏర్పాట్లు



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: విద్యార్థుల్లో వ్యర్థాల వర్గీకరణ, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించేందుకు బకల్‌వాడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈవేస్ట్ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహిం చారు. బుధవారం రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఈ నెల 28వ తేదీని ఈవేస్ట్ దినంగా ప్రకటించిన నేపథ్యంలో పాఠశాలలో ఎకో క్లబ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు అలుగుబెల్లి కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు వ్యర్థాల నిర్వహణపై అవ గాహన కల్పించడం అవసరమని తెలిపారు. పర్యావరణానికి హాని కలిగించే వ్యర్థాలను నిర్లక్ష్యంగా పడేయకుండా వాటిని వేర్వేరుగా సేకరించి సరైన విధానంలో నిర్వ హించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు.పాఠశాలలో ఎకో క్లబ్ ద్వారా నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా వివిధ రకాల వ్యర్థాలను వేరు చేసేందుకు వేర్వేరు రంగుల్లో డబ్బాలను ఏర్పాటు చేసినట్లు ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ఎలక్ట్రానిక్ పరికరాలను సాధారణ చెత్తతో కలపకుండా ప్రత్యేకంగా సేకరించడం వల్ల పర్యావ రణ పరిరక్షణకు తోడ్పడవచ్చని తెలిపారు. కార్యక్ర మంలో ఎకో క్లబ్ ఇన్‌చార్జ్ ధనావత్ శ్రీను, ఉపాధ్యా యులు కర్నాటి శ్రీను, దయాకర్‌రెడ్డి, నీలియా, నల్ల మేకల వెంకయ్య, అజ్మత్ ఖాన్, చంద్రయ్య, పీడీ సైదులు, రహీం దా, శివ, పద్మావతి, గిరిజ, సునీత, భాను, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

ప్రజాపక్షం/గుండాల; యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం ఉమ్మడి ఖమ్మంనల్గొండవరంగల్ పట్టభద్రుల ఎన్నికలలో పట్టభద్రులు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని, నేటి సమాజంలో ఓటు హక్కు ఎంతో కీలకమైందని ప్రతి ఒక్క పట్టభ ద్రుడు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని ఆలేరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఈరసారపు యాద గిరిగౌడ్ సూచించారు. ఈసందర్భంగా బుధవారం మండల కేంద్రంలో పట్టభద్రుల ఓటు నమోదుపై కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ప్రతి ఒక్క పట్టభద్రుని వద్దకు వెళ్లి వారి ఓటును నమోదు చేయించే విధంగా కృషి చేయాలని సూచించారు.



తుఫాను దెబ్బకు నేలకొరిగిన వరిపంట

ప్రజాపక్షం/మునగాల: అర్నాబ్ తుఫాన్ ప్రభావంతో మునగాల మండలంలోని పలు గ్రామాల్లో వరి పంట నేలకొరిగింది. నెలల తర బడి కష్టపడి సాగు చేసిన పంట కోత దశకు చేరుకున్న సమయంలో దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని ముకుందాపురం గ్రామానికి చెందిన రైతు దామెర కృష్ణయ్య తన కున్న ఏడు ఎకరాల్లో వరిసాగు చేయగా, తుఫాన్ ప్రభావంతో సుమారు మూడు ఎకరాలకు పైగా నేలవాలింది. ఈ సంవత్సరం పంట దిగుబడి ఎక్కువగా వస్తుందిన ఆశించిన యాజమాని ఒక్కసా రిగా తుఫాన్ ప్రభావం చూపడంతో అతని ఆశలు అడియాశల య్యాయి. నారుమడి దున్నిన దగ్గర నుంచి నాటు వేసేంత వరకు ఒక ఎత్తయితే అసలే ఎలనినో కారణంగా సాగర్ నీరు అందక, ఉన్న బోరు, బావుల ద్వారా సాగు చేసిన వరి పంట చేతికొచ్చే సమ యంలో సాగుకైన ఖర్చులు కూడా వస్తాయో లేదోనని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వ్యవసాయ అధికారులు పరిశీలించి పంట నష్టపరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

ప్రజల మన్ననలు పొందేలా విధులు



ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ ; ప్రజల మన్ననలు పొందేలా విధు లు నిర్వర్తించాలని జిల్లా ఎస్పి కె. నరసింహ ఆదేశించారు. ఆర్మ్డ్ రిజర్వ్ నందు కానిస్టేబుల్స్‌గా పని చేస్తున్న రాంబాబు, రామారావు, అశోక్, బషీర్‌లు నలుగురు ఏఆర్ హెడ్ కానిస్టేబుల్స్‌గా పదోన్నతి పొందారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయం నందు ఎస్పి వారికి ప్రమోషన్ ఉత్తర్వులు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగోన్నతితోపాటుగా బాధ్యతలు పెరుగుతాయని తెలిపారు. బాధ్యతలకు అనుగుణంగా విధుల నిర్వ హణలో అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఉత్తమ సేవలు అందించాల ని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి రవీందర్ రెడ్డి, ఆర్మ్డ్ డిఎస్పి నరసింహ చారి, ఆర్ఐ ప్రవీణ్ కుమార్, పోలీస్ సంఘం అధ్యక్షులు రమేష్, కార్యదర్శి కిరణ్ పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కీలకపాత్ర పోషించనున్న జనసేన

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : జిల్లాలో జనసేన పార్టీకి బలమైన పునాది ఉందని, రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కీలక పాత్ర పోషించనుందని జనసేన పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్ర టరీ,ఖమ్మం వరంగల్ నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ గడల శ్రీనివాసరావు పేర్కొన్నారు.బుధవారం పట్టణంలోని హోటల్ విస్టా గ్రాండ్ లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబం ధించి జనసేన రాష్ట్ర జాయినింగ్ కమిటీ కన్వీనర్ ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన గడల శ్రీనివాసరావు మాట్లాడుతూ... పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను వేగ వంతం చేయడంతో పాటు,ఎన్నికల ప్రచారాన్ని సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని జనసైనికులకు పిలుపునిచ్చారు. ప్రతి నియోజకవర్గంలో క్షేత్రస్థాయిలో చురుగ్గా పనిచేస్తూ అర్హులైన పట్ట భద్రులకు ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలని సూచిం చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేసి జనసేన విజయానికి కట్టుబడి పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.ఈ సమా వేశంలో రాష్ట్ర జాయినింగ్ కమిటీ సభ్యుడు ప్రజిత్ గౌడ్,రాష్ట్ర అధి కార ప్రతినిధులు మిరియాల రామకృష్ణ, సాంబశివుడు,రాష్ట్ర నాయ కులు వంగ లక్ష్మణ్ గౌడ్,కార్తీక్ తో పాటు నియోజకవర్గాల,జిల్లా నాయకులు పాల్గొన్నారు.



గుండాలను కరువు మండలంగా ప్రకటించాలి

ప్రజాపక్షం/గుండాల; యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలాన్ని తక్షణమే కరువు మండలంగా ప్రకటించి వరి, పత్తి పంటలకు ఎకరాకు రూ. 20వేల నష్టపరిహారం అందించాలని యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ కార్యవర్గ సభ్యులు కునుమాని హరిచంద్ర రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో తక్కువ వర్షా పాతం నమోదు కావడంతో రైతులు నీరు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, నీరు లేక పంటల దిగుబడి గణనీయంగా తగ్గిందని తద్వారా రైతులు పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని దీంతో రైతులు అప్పుల పాలు కాకతప్పదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్‌నినో ప్రభావంతో బోర్లు, బావులు పూర్తి స్థాయిలో ఎండిపోవడంతో బోర్ల వద్ద, బావుల వద్ద ఉన్న పంట సైతం ఎండిపోయిందని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం గుండాల మండలాన్ని కరువు మండ లంగా ప్రకటించి రైతులకు నష్టపరిహారం అందించా లని ఆయన కోరారు.

ఆర్థిక సాయం అందజేత



ప్రజాపక్షం/గుండాల; యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం సుద్దాల గ్రామానికి చెందిన బొంత సంతోష్ ప్రమాదవశాత్తు మరణించడంతో మానవ సేవే మాదవ సేవా అనే నినాదంతో ముందుకు వెళుతున్న మబ్బు అబ్బాస్ ఫౌండేషన్ ఆధ్వ ర్యంలో ఫౌండేషన్ చైర్మన్ మబ్బు మహేష్ బుధవారం సంతోష్ కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సాను భూతిని తెలిపి రూ. 5వేలను ఆర్థిక సాయంగా అంద జేశారు. అనంతరం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన క్యాసగల్ల రాములు అనారోగ్యంతో మరణించడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూ తిని తెలిపారు. రూ.5వేలను ఆర్థిక సాయంగా అందజే శారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ గడ్డమీది మహో దయ్, ఉప సర్పంచ్ నగేష్, అయిలయ్య, వెంకటేష్, రాజు, బాలరాజు, ఉపేందర్, వీరస్వామి, యాదగిరి, రాములు, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన

ప్రజాపక్షం/గుండాల; యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం మాసాన్‌పల్లి గ్రామంలోని అంగన్ వాడీ కేంద్రాన్ని బుధవారం సీఈఓ చిలుకూరి శ్రీని వాస్ సందర్శించి పరిశీలించారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు అందిస్తున్న పోషకా హారాన్ని పరిశీలించి, ఆహార నాణ్యత, పరిశుభ్రత, పిల్లలకు అందుతున్న పౌష్టికాహార వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు అందిస్తున్న విద్యా బోధన, వారి అభ్యసన సామర్థ్యం, ఆరోగ్య పరిరక్షణపై వివరాలు తెలుసుకుని, పిల్లలకు నాణ్యమైన పోషకాహారం అందించడంతో పాటు చిన్న నాటి నుంచే విద్యపై ఆసక్తి పెంపొందించేలా అంగన్ వాడీ టీచర్లు, ఆయాలు ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని అన్నారు. అంగన్‌వాడీ టీచర్లు మమత, వీరలక్ష్మి, ఆయా మంజుల తదితరులు పాల్గొన్నారు.



మానవ హక్కుల కమిషన్ చైర్మన్‌ను కలిసిన ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : ఎన్‌హెచ్‌ఎం ఉద్యో గుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరవ ధిక సమ్మె బుధవారం నాటికి 16వ రోజుకు చేరు కుంది.ఈ సందర్భంగా జనసేన పార్టీ రాష్ట్ర ఆర్గనై జింగ్ సెక్రటరీ,ఎమ్మెల్సీ అభ్యర్థి గడల శ్రీనివాసరావు దీక్షా శిబిరానికి చేరుకుని ఎన్హెచ్ఎం ఉద్యోగులకు సంఘీభావం తెలిపారు.అనంతరం ఆయన మాట్లా డుతూ ప్రజారోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషి స్తున్న జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగులు ఏళ్ల తర బడి కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్ధతుల్లో పనిచే స్తున్నా ఉద్యోగ భద్రత లేకపోవడం, వేతనాల్లో అన్యాయం జరుగుతోందని అన్నారు.తమ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు ఆందోళనలు చేపడుతున్నారని, ప్రభు త్వం స్పందించి అన్ని కేడర్ల ఉద్యోగులకు కేడర్ ఫిక్సే షన్ చేసి,కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బందిని క్రమ బద్ధీకరించాలని కోరారు.అనంతరం ఉద్యోగులు మానవ హక్కుల కమిషన్ చైర్మన్ షమీమ్ అక్తర్ ను కలిసి వినతి పత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో ఉద్యోగులు డాక్టర్ హరిప్రియ,మైక్రోబయాలజిస్ట్ ఉపేందర్,డాక్టర్ ప్రియాంక,మెడికల్ ఆఫీసర్ గాలి రాంబాబు,మౌనిక, దయానంద్,డెంటల్ టెక్నీషియన్ శ్రీనివాస్,బోడుపల్లి రమేష్,తరాల సురేష్, వనజ తది తరులు పాల్గొన్నారు.

శివన్నగూడెం ప్రాజెక్టు పనులను వెంటనే పూర్తి చేయాలి



ప్రజాపక్షం/మర్రిగూడ : మునుగోడు,దేవరకొండ నియోజకవర్గాల రైతులకు సాగునీరు అందించా లంటే శివన్నగూడెం ప్రాజెక్టు పనులను ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డి డిమాండ్ చేశారు.మండల బీజేపీ అధ్యక్షుడు పాత్లావత్ రాజేంద్ర నాయక్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు,కార్యకర్తలు భారీ సంఖ్యలో శివన్న గూడెం ప్రాజెక్టును సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు.ఈ సందర్భంగా నాగం వర్షిత్ రెడ్డి మాట్లాడుతూ ప్రాజెక్టు నిర్మాణంలో జాప్యం కారణం గా రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొం టున్నారన్నారు.ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని వీడి పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కోరారు. డిండి ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ నాయ కులు భిన్నమైన ప్రకటనలు చేస్తున్నారని విమర్శిస్తూ, రైతుల సాగునీటి సమస్యపై ప్రభుత్వం స్పష్టమైన వైఖరి ప్రకటించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్ర మంలో దోనూరు వీరారెడ్డి, యాస అమరేందర్ రెడ్డి, దూడల బిక్షం గౌడ్,పిట్టల శ్రీనివాస్,రాజు యాదవ్, యాస అశోక్ రెడ్డి,వేపేపల్లి శ్రీనివాసరావు,కీసరి రవీం దర్ రెడ్డి, జిల్లాకుల సైదులు యాదవ్,రాకొండ ప్రదీప్ రెడ్డి,చాపల వెంకటేష్,కుక్కల వెంకటేష్,నూకల మల్లేష్,ఆంగోత్ భాస్కర్ నాయక్‌లు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జాయింట్ సెక్రటరీగా సాగర్ల



ప్రజాపక్షం/కోదాడ రూరల్ (చిలుకూరు) : రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జాయింట్ సెక్రటరీగా చిలుకూరు మండలం అర్లెగూడెం గ్రామ రేషన్ డీలర్ సాగర్ల శివరావు నియమితులయ్యారు. తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు నాయకోటి రాజు ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ప్రకటించిన నూతన కార్యవర్గంలో శివరావుకు ఈ బాధ్యతలు అప్పగించారు. శివరావు నియామకం పట్ల చిలుకూరు మండలం రేషన్ డీలర్లు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు. జిల్లా రేషన్ డీలర్ల అధ్యక్షుడు కనుమర్లపూడి శ్రీనివాస రావు, కార్యదర్శి ఖాజామొయినుద్దీన్, కోదాడ ఐఎంజి ప్రెసిడెంట్ ఆంజనేయులు, మండల రేషన్ డీలర్ల అధ్యక్షుడు పూర్ణచంద్రరావు తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

నవంబర్ 6న జిల్లాస్థాయి యువజన కళాకారుల ఎంపిక

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : జిల్లాస్థాయి యువజ నోత్సవాల సందర్భంగా సూర్యాపేట జిల్లాలోని వయసు 15 నుండి 29 సంవత్సరాల లోపు యువతీ యువకులకు జాన పద నృత్యం (గ్రూప్), జానపద పాటలు (గ్రూప్), చిత్రలే ఖనం, కవిత్వం, వీది నాటకం నందు నవంబర్ 6న జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో పోటీలు నిర్వ హించనున్నట్లు డివైఎస్ఓ బి. వెంకట్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలలో ప్రథమ స్థానం సాధిం చిన వారిని రాష్ట్రస్థాయి యువజనోత్సవాలకు పంపడం జరు గుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన వారిని జాతీయ స్థాయిలో జనవరి 10 నుండి 12 వరకు న్యూఢిల్లీలో జరిగే యువజనోత్సవాలకు పంపడం జరుగుతుందన్నారు. యువజన ఉత్సవాల్లో పాల్గొనేవారు వారి యొక్క వివరాలను నవంబర్ 4లోపు జిల్లా సమీకృత కలె క్టరేట్ కార్యాలయంలో ఉన్న జిల్లా యువజన, క్రీడల కార్యా లయములో స్వయంగా గాని లేదా కార్యాలయం యొక్క ఈ మెయిల్ dysosuryapet123@gmail.comకు లేదా వాట్సప్ నెంబర్ 9100949979 ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాపక్షం/మర్రిగూడ : గ్రామ పంచా యతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐ టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య డిమాండ్ చేశారు.మండల కేంద్రంలో జరిగిన తెలంగాణ గ్రామ పంచా యతీ వర్కర్స్ యూనియన్ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులకు నెలల తరబడి వేతనాలు పెండింగ్ లో ఉన్నాయని, వెంటనే చెల్లించా లన్నారు.నవంబర్ 15న జరగనున్న ఏఐకే ఎస్ 36వ జాతీయ మహాసభల బహిరంగ సభను జయప్రదం చేయాలని, గ్రామ పం చాయతీ కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావా లని పిలుపునిచ్చారు. యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు రామావత్ రాజు నాయక్, నక్క నరసింహ,పెరుమాండ్ల మంజుల, సల్బోజు రామలింగాచారి ఉన్నారు.



అభివృద్ధి పనులకు శ్రీకారం

ప్రజాపక్షం/చందంపేట; చందంపేట మండలంలో బుధవారం దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ పలు అభివృద్ధి పను లకు శ్రీకారం చుట్టారు. చందంపేట మండల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతూ బుధవారం మండలంలో పర్యటించిన ఎంఎ ల్‌ఏ పలు గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొ న్నారు. చిత్రియాల గ్రామంలోని కాటమయ్య గుడి సమీపంలో, రేకులగడ్డ గ్రామంలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ఎంఎల్‌ఏ ప్రారంభించారు. బుడ్డోనితండా పరిధిలోని వెంకట్‌తండాలో నూత నంగా నిర్మించిన సిసి రోడ్డును ప్రారంభించి, మూడుదండ్ల గ్రామంలో మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయడంతో పాటు మూడు ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్ర మంలో పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్య క్రమంలో మల్లారెడ్డి, గోవింద్, బద్యనాయక్, సురేష్‌గౌడ్, హరి కృష్ణ, సర్పంచ్‌లు చిరంజీవి, జలందర్‌గౌడ్, సాధిక్, బిక్కు, పాపా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఎమ్మెల్సీ ఆశీర్వాదం



ప్రజాపక్షం/నాంపల్లి: మండలంలోని వడ్డేపల్లి గ్రామానికి చెందిన సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి, ఉప సర్పంచ్ బుషిపాక యాదయ్య వనజ దంపతుల కుమారుడు, కుమార్తె నూతన పట్టు వస్త్రలంకరణ మహోత్సవ కార్యక్రమానికి బుధవారం పార్టీ జిల్లా కార్య దర్శి,ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారులను ఆశీర్వదించి,వారికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు, సిపిఐజిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్. అంజయ్య చారి,మండల కార్యదర్శి సుదన బోయిన రమేష్,సహాయ కార్యదర్శి నేతాళ్ల రాజు,ప్రజానాట్యమం డలి జిల్లా అధ్యక్షుడు బుడిగపాక జగన్,కోరే సత్తయ్య,పల్లె సైదులు,ఊరిపక్క వెంకటయ్య,నేరెళ్ల సైదులు,నాయకులు గిరి స్వామి,రేవెల్లి సర్పంచ్ బట్టు శ్రీను, చెన్నోజు వెంకటాచారి,దామెర రమేష్, నారపాక రవి, కొన్‌రెడ్డి యాదయ్య పాల్గొన్నారు.

బైక్ ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



ప్రజాపక్షం/చందంపేట; నల్గొండ జిల్లా చందంపేట మండలం కాట్రావత్‌తండా సమీపంలో బుధ వారం సాయంత్రం ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తికి తీవ్ర గాయాలు అయిన సంఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే దేవరకొండ పట్టణానికి చెందిన అంజయ్య తన ద్విచక్ర వాహనంపై పని నిమిత్తం రేకులగడ్డ గ్రామానికి వెళ్లి పని ముగించుకొని తిరిగి దేవరకొండకు వస్తున్న క్రమంలో మార్గం మధ్యలో కాట్రావత్ తండా వద్దకు రాగానే అంజయ్య ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడడంతో తలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఘటన స్థలానికి చేరుకున్న ఎస్ఐ లోకేష్ సంఘ టన స్థలాన్ని పరిశీలించి గాయపడిన అంజయ్యను 108 వాహ నంలో దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నవంబర్ 4న మండల స్థాయి సమావేశం

ప్రజాపక్షం/మర్రిగూడ :మండల పరిషత్ కార్యాలయంలో నవం బర్ 4న ప్రత్యేక అధికారి వేణుగోపాల్ ఆధ్వర్యంలో మండల స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జి.సి. మున్నయ్య తెలిపారు.వివిధ శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన నివేదికలను ఈ నెల 30న మండల పరిషత్ కార్యాలయంలో సమ ర్పించాలని సూచించారు.

మాజీ ఉపసర్పంచ్ బెదరకోట యాదగిరి కన్నుమూత

ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి: పోచంపల్లి పట్టణానికి చెందిన ప్రముఖ దినపత్రిక విలేకరి బెదరకోట శ్రావణ్ తండ్రి మాజీ ఉపసర్పంచ్ బెదరకోట యాదగిరి అనారోగ్యంతో బుధవారం కన్నుమూశారు.మృతుడు యాదగిరి1982/89 మధ్యకాలంలో పోచంపల్లి గ్రామ ప్రజలకు ఉపసర్పంచ్ సేవలు అందించారు.పలువురు పత్రికా విలేకరులు, రాజకీయ ప్రముఖులు ,అధికారులు ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా అంజలి ఘటించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ధాన్యం కొనుగోళ్ళు వెంటనే చేపట్టాలని డిమండ్

ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి: పోచంపల్లి మండల వ్యాప్తంగా ఉన్న అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతుల వద్ద నుండి వెంటనే ధాన్యం సేకరించాలని సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొండమడుగు నర్సింహ్మ బుధవారం డిమాండ్ చేశారు.జూలూరు గ్రామంలోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించి రైతులతో మాట్లాడారు. అలాగే నవంబర్ 15 నుండి 18వరకు జిల్లా కేంద్రంలో జరిగే అఖిల భారత రైతు సంఘం జాతీయ 36వ మహా సభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కోట రామచంద్రారెడ్డి మండల కార్యదర్శి గూడూరు బుచ్చిరెడ్డి సిపిఎం మండల కార్యవర్గ సభ్యులు మంచాల మధు యాదమ్మ ప్రతాప్ రెడ్డి మధు,లక్ష్మి వెంకన్న, లక్ష్మమ్మ మల్లమ్మ పూజ,తిరుమల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బంతి పూల సాగు..లభాలు బాగూ



ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి: పండగ ఏదైనా సరే పూల తోరణాలు ఉండాల్సిందే.శుభకార్యం ఎలాంటి దైనా సరే ఆపూల అలంకరణ లేకపోతే కళ తప్పినట్లే. అంతలా ఆ రంగు రంగు పూల రెమ్మల అందం. మగువల కొప్పులోనైనా భగవంతుడి ఫోటో కైనా దైవ సన్నధిలోనైనా బోసం అలంకరణకైనా బతుకమ్మ ఆటకైనా ..వధువరుల మెడలోనైన ఆ పూల గుత్తి లేకపోతే శోభాయమానంగా ఉండనే ఉండదు.అదీ దాని ప్రత్యేకత.ఆ ప్రకృతి అందాల పరవశమే ముద్దబంతి పూలు. పోచంపల్లి మున్సిపాలిటి పరిధిలోని ముక్తాపూర్ బీబీనగర్ రోడ్డు ప్రక్కన ఓ రైతు అందకి భిన్నంగా బంతి పూల సాగు చేస్తున్నాడు.దీపావళి సమీపిస్తుండటంతో తోటం తా విరగబూసి దీపావళికి నేను రెడీ..అన్నట్లుగా బుధవారం ఇలా ప్రజాపక్షం కెమెరాకు చిక్కి కనువిందు చేసింది.

తెలంగాణ ప్రజాఫ్రంట్ ఆవిర్భావ సభను విజయవంతం చేయండి

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : ఈనెల 31న కొత్తగూడెం జిల్లా కేంద్రంలో జరుగు తెలంగాణ ప్రజాఫ్రంట్ 17 ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని తెలంగాణ ప్రజాఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి కావలి యాదయ్య అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సిపిఎం కార్యాలయంలో టిపిఎఫ్ జిల్లా కమిటి సభ్యులు బాలగాని మదర్ గౌడ్ ఆధ్వర్యంలో ఆవిర్భావ సభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట సామాజిక అధ్యయన వేదిక కన్వీనర్ లింగంపల్లి భద్రయ్య, తెలంగాణ ఆదబిడ్డల వేదిక రాష్ట్ర కన్వీనర్ వెలుగు వనిత, తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర కమిటి సభ్యులు నల్లెడ మాధవరెడ్డి, ఇక్బాల్, ఉదయ్, ప్రజాకళాకారులు నారబోయిన వెంకట్ యాదవ్ పాల్గొన్నారు.

ఖర్గే వ్యాఖ్యలు అప్రజాస్వామికం: శ్రీలత రెడ్డి



ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కుటుంబం గురించి కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే చేసిన అనుచిత వ్యాఖ్యలు అప్రజాస్వామికమని బిజెపి సూర్యాపేట జిల్లా అధ్యక్షురాలు చల్ల శ్రీలత రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఖర్గే వ్యాఖ్యలకు నిరసనగా ఆయన దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజకీయాల్లో విమర్శలు, సిద్ధాంతపరమైన భిన్నాభిప్రాయాలు సహజమన్నారు. రాజకీయ విమర్శలు వ్యక్తిగత కుటుంబాల ప్రస్తావన వరకు వెళ్లడం సమంజసం కాదని అభిప్రాయపడ్డారు. రాజకీయాల్లో వ్యక్తిగత కుటుంబాలను లక్ష్యంగా చేసుకునే వ్యాఖ్యలు ప్రజాస్వామ్య రాజకీయ సంప్రదాయాలకు విరుద్ధమని అన్నారు. వ్యాఖ్యలపై తక్షణమే బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఫణి నాయుడు, రమేష్, మల్సూర్, సాయి రెడ్డి, పాండురంగాచారి, రవివర్మ, పృధ్వీ, పరుశురామ్, సోమయ్య, వెంకన్న పాల్గొన్నారు.

హరిసింగ్‌నాయక్ భౌతికకాయానికి నివాళులు



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: మొదటి తరం బంజారా ఉద్యోగి, బంజారా ఉద్యోగుల సంఘం నల్గొండ జిల్లా మాజీ అధ్యక్షుడు, టీటీడీ జెఈఓ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆడవత్ శరత్‌నాయక్ మామ ధరావత్ హరిసింగ్‌నాయక్ మృతి చెందడం బంజారా సమాజానికి తీరని లోటని ఏఐబిఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఇస్లావత్ రాంచందర్‌నాయక్ పేర్కొన్నారు. బుధవారం ధరావత్ హరిసింగ్‌నాయక్ భౌతికకాయానికి పూలదండలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హరిసింగ్‌నాయక్ బంజారా సమాజ అభివృద్ధికి, ఉద్యోగుల సంక్షేమానికి చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. వారి కుటుంబ సభ్యులకు తమ సంతాపాన్ని, సానుభూతిని తెలియజేశారు. బంజారా సమాజం కోసం ఆయన అందించిన మార్గదర్శకత్వం ఎల్లప్పుడూ స్మరణీయమని తెలిపారు. శోకసంద్రంలో ఉన్న కుటుంబ సభ్యులకు ధైర్యం ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో బంజారా ఉద్యోగుల సంఘం తెలంగాణ రాష్ట్ర కన్వీ నర్ మాలోత్ దశరథ్‌నాయక్, బిక్కు నాయక్, సీతారాం నాయక్, మాతృనాయక్, సంఘ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి ఘన వీడ్కోలు



ప్రజాపక్షం/ రామన్నపేట: విద్యారంగంలో ఎంతో మంది విద్యార్థులకు జ్ఞానాన్ని అందించి, ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన కొమ్మాయిగూడెం జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ఇంగ్లీష్ అధ్యాపకులు బందా బాలరాజు ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో బుధవారం ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో ప్రముఖులు, గ్రామస్థులు, సహచర ఉపాధ్యాయులు ఆయన సేవలను కొనియాడుతూ ఘనంగా సత్కరించారు. కొమ్మాయిగూడెం సర్పంచ్ మారేపల్లి మల్లారెడ్డి కార్యక్రమానికి విచ్చేసి, బందా బాలరాజుని ఆప్యాయంగా కలిసి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మల్లారెడ్డి మాట్లాడుతూ రిటైర్మెంట్ జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయుడిగా ఆయన చేసిన అమూల్యమైన సేవలను కొనియాడుతూ శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి సురేందర్ రెడ్డి, ఉపసర్పంచ్ తీర్పాల ఐలయ్య పాల్గొని బందా బాలరాజుకి శుభాకాంక్షలు తెలిపారు. విద్యాబోధనలో ఆయన చూపిన అంకితభావాన్ని అందరూ ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు, ప్రముఖులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులకు నమ్మకం కల్పించాలి

మునుగోడు పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన ఎస్పి



ప్రజాపక్షం/మునుగోడు : పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసిన బాధితులకు న్యాయం జరుగుతుందన్న నమ్మకాన్ని కల్పించాలని జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ పోలీస్ సిబ్బందికి సూచించారు.బుధవారం వార్షిక తనిఖీలో భాగంగా మునుగోడు పోలీస్ స్టేషన్ ను సందర్శించి స్టేషన్ పనితీరు, సిబ్బంది విధుల నిర్వహణ,కేసుల దర్యాప్తు పురోగతిని సమీక్షించారు. స్టేషన్ కు చేరుకున్న ఎస్పికి సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. అనంతరం స్టేషన్ పరిసరాలు,రిసెప్షన్ కౌంటర్, రికార్డుల నిర్వహణ, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు.ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ బాధితుల సమస్యలను ఓపికగా విని ఫిర్యాదులపై చట్టప్రకారం తక్షణ చర్యలు తీసుకోవాలని,ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ పోలీస్ శాఖ ప్రతిష్టను పెంపొందించాలని తెలిపారు.కేసుల దర్యాప్తులో జాప్యం జరగకుండా ప్రత్యేక దృష్టి సారించాలని, శాస్త్రీయ పద్ధతులను అనుసరిస్తూ సాక్ష్యాధారాలను సేకరించి,నేరస్థులకు శిక్ష పడేలా పకడ్బందీగా దర్యాప్తు పూర్తి చేసి నిర్ణీత గడువులో చార్జిషీట్లు దాఖలు చేయాలని ఆదేశించారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి కార్యాచరణ రూపొందించాలన్నారు.ఈ తనిఖీలో చందూర్ సీఐ రాము, డీసీఆర్ బీ సీఐ శ్రీను నాయక్, మునుగోడు ఎస్ఐ శోభన్ బాబు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: ఆరుగాలం కష్టపడి ఎన్నో వ్యయప్రయాసలకోర్చి పంటలు సాగు చేసిన రైతులకు పంట చేతికొచ్చే సమయంలో అకాల వర్షాలు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయని, పంట నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వరి పంట కోతకు వచ్చిన సమయంలో ఈదురు గాలులతో కూడిన అకాల వర్షాలు కురవడంతో రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో వరి పంట నేలకొరిగి రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పెట్టుబడుల కోసం అప్పులు చేసి ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు, కూలీల ఖర్చులు భరించిన రైతులకు ఈ పంట నష్టం మరింత ఆర్థిక భారంగా మారిందని పేర్కొన్నారు.ప్రభుత్వ అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి అకాల వర్షాల వల్ల జరిగిన పంట నష్టాన్ని సమగ్రంగా అంచనా వేయాలని కోరారు.

ఓటరు నమోదు ప్రక్రియ వేగవంతం



ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ : పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, మాజీ డిసిసి ఉపాధ్యక్షులు బీరవోలు వీరా రెడ్డి కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం భద్రాచలం శాసన సభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు కార్యాలయంలో పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల శాసనమండలి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట మండల మాజీ వైస్ ఎంపిపి రామసాని శ్రీనివాస నాయుడు, రామచంద్రాపురం గ్రామ మాజీ సర్పంచ్ మాలి అనంత రెడ్డి, మండల నాయకులు చెరుకు వెంకన్న, గొల్ల రమేష్‌లు పాల్గొన్నారు.

సిఐని కలిసిన సిపిఐ నాయకులు



ప్రజాపక్షం/చౌటుప్పల్ : చౌటుప్పల్ సిఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన డి.సతీష్‌రెడ్డిని బుధవారం సిపిఐ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సన్మానించి శుభాకాంక్షలు చెప్పారు. మండలంలోని ప్రజా సమస్యలు,శాంతిభద్రతల పరిరక్షణ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోరారు.ప్రజా సమస్యల పరిష్కారానికి సిపిఐ పార్టీ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యులు పల్లె శేఖర్ రెడ్డి,మునిసిపల్ కార్యదర్శి పగిళ్ళ మోహన్‌రెడ్డి,నాయకులు ఉడుత రామలింగం,బద్దుల సుధాకర్,టంగుటూరి రాములు,రొండి నర్సింహ్మ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనం పున: ప్రారంభం



ప్రజాపక్షం/చౌటుప్పల్: చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామంలో దెబ్బతిన్న అంగన్‌వాడీ భవనానికి మరమత్తులు చేసిన తర్వాత బుధవారం గ్రామసర్పంచ్ గిర్కంటి నిరంజన్‌గౌడ్ పున ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్ర భవనం శిథిలావస్థకు వచ్చిన నేపథ్యంతో గ్రామపంచాయతీ నిధుల ద్వారా మరమత్తులు చేయించడం జరిగిందని తెలిపారు.గ్రామాభివృద్ధి కోసం నిరంతరం పని చేయడం జరుగుతుందని అన్నారు.చిన్నారులకు మెరుగైన సదుపాయాలు కల్పించడానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ వార్డు సభ్యులు సుంకరి విజయ్‌కుమార్,పొట్లపల్లి శివశంకర్,సంగెం రవి తేజ,రాజు,మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అర్నబ్ తుఫాన్ దెబ్బకు ఆందోళనలో రైతులు

ఎల్‌నినో ప్రభావానికి తోడైన తుఫాను
ఈదురుగాలుల భీభత్సం...
నేలకొరిగిన వరి పంటలు



ప్రజాపక్షం/నేరేడుచర్ల: బంగాళఖాతంలో ఏర్పడిన అర్నబ్ తుఫాను ప్రభావంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. బుధవారం కురిసిన వర్షానికి సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండల వ్యాప్తంగా పలుచోట్ల వరి పంటలు నేలకొరిగాయి. ఈరుగాలం కష్టపడి సాగుచేసిన పంట చేతికొచ్చే సమయంలో ప్రకృతి కన్నెర చేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి నెలకొంది.

ఎల్‌నినో ప్రభావంతో ఇప్పటికే ఇబ్బందులు

ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితులు అనుకూలించక, సాగునీటి కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నీటి వసతి సరిగా లేకపోవడంతో చాలమంది రైతులు వరిసాగును తగ్గించుకున్నారు. అరకొర నీటి సౌకర్యంతో సాగుచేసిన పంటను ఎలాగోలా కాపాడుకుంటూ చివరి దశకు తీసుకవచ్చారు. తీరా పంట చేతికొచ్చే సమయంలో తుఫాన్ ప్రభావంతో వీచిన బలమైన గాలులు, వర్షం రైతుల ఆశలపై నీళ్లు చల్లాయి.

నేలవాలిన వరి.. దిగుబడిపై ఆందోళన

ఈదురుగాలుల ధాటికి వరిపొలాల్లో పంట నేలవాడటంతో ధాన్యం దిగుబడిపై ప్రభావం పడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట కోతకు సిద్ధమవుతున్న తరుణంలో వర్షాలు కురవడం మరింత ఆందోళన కలిగిస్తోంది. నేలకొరిగిన వరి పంటను కోయడం కష్టతరంగా మారడంతోపాటు, వర్షాలు కొనసాగితే ధాన్యం నాణ్యత దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే పెట్టుబడుల భారం, సాగునీటి సమస్యలతో సతమతమవుతున్న తమకు తాజా వర్షాలు మరింత నష్టాన్ని మిగిల్చాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రకృతి వైఫరిత్యాలతో కుదేలవుతున్న రైతన్న

పంటసాగు నుంచి కోత వరకు ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొంటున్న రైతులకు ప్రకృతి వైఫరీత్యాలు శాపంగా మారుతున్నాయి. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, కూలీల ఖర్చులు పెరగడంతో పెట్టుబడి భారం అధికమైంది. ఈ పరిస్థితుల్లో పంట దిగుబడి తగ్గితే అప్పులు ఎలా తీర్చాలోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎల్‌నినో ప్రభావం, నీటి కొరత, ఇప్పుడు తుఫాన్ కారణంగా కురుస్తున్న వర్షాలు ఒకదాని వెంట ఒకటి రైతులను దెబ్బతిస్తున్నాయి. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



యధావిధిగా కొనసాగించాలి

ప్రజాపక్షం/చౌటుప్పల్ : పట్టభద్రుల ఓటర్ జాబితాను గతంలో ఉన్న ఓటర్లను కొనసాగించాలని చౌటుప్పల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు తాడూరి పరమేష్ అన్నారు. బుధవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో చౌటుప్పల్ ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఓటర్ జాబితా ఉన్న కూడా తిరిగి ఓటు నమోదు చేయాలని చెప్పడంతో పట్టభద్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.దరఖాస్తు చేసుకున్న వారు తహశీల్దార్ కార్యాలయంలో పత్రాలు ఇవ్వాలని చెప్పడం తగదని అన్నారు.ఎన్నికల ప్రధాన అధికారి దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు ఎండి.ఖయ్యూం,పిల్లలమర్రి కిరణ్,బాల్యం వెంకటచలపతి,పరమేష్,శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పంటలు ఎండడానికి అధికారుల నిర్లక్ష్యమే కారణం..

తూములు, కాల్వలు సరిగ్గా లేక మొదట్లో వృథాగా పోయిన నీరు
పట్టించుకోని అధికారులు....మైనోద్దిన్



ప్రజాపక్షం/డిండి; డిండి ఆయకట్టు రైతులు రైతుల పంటలు ఎండిపోవడానికి ప్రధాన కారణం అధికారుల నిర్లక్ష్యమేనని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎండి. మైనోద్దిన్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ నీటిని పొదుపుగా వాడే సమయంలో మొదటి నీళ్లు విడిచిన నెల రోజుల్లో అధికారులు నీటిని కట్టడి చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని వృధాగా నీటిని పోనిచ్చారని కాల్వల మరమ్మతులు చేయకుండా ఇష్టారీతిలో నీటిని వృధాగా పోనిచ్చారని అన్నారు. 25 ఫీట్ల నీళ్లు ప్రాజెక్టులో ఉన్నప్పుడే రైతుల పంటలు పండాయని ప్రాజెక్టులో సరిపడే నీరు 35 అడుగుల మేర నీరున్నప్పుడు రైతులకు నీళ్లు వదిలితే పంటలను నిర్ధాక్షిణ్యంగా ఎండబెట్టారని అన్నారు. అధికారుల పర్యవేక్షణ కారణంగానే పంటలు ఎండిపోయాయని అన్నారు. ప్రస్తుతం పొట్ట దశలో పంటలు ఉన్నాయని ప్రాజెక్టు తూం ఎదుట ఉన్న షీట్లను తీయడం ద్వారా దాదాపు రెండు తడులకు నీళ్లు వచ్చే పరిస్థితి ఉందని ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. గతంలో అధికారులు లేకున్నా పంటలు పూర్తిస్థాయిలో పండాయని ప్రస్తుతం ప్రాజెక్టుకు ఈఈ, డిఈలు, ఏఈలు, సూపర్‌వైజర్లు, లష్కర్లు సరిపడా సిబ్బంది ఉన్నా పంటలను కాపాడలేని పరిస్థితి నెలకొందని పంటలు ఎండిపోవడానికి ప్రధాన కారణం అధికారల నిర్లక్ష్యమేనని మైనోద్దిన్ అన్నారు. ప్రాజెక్టు కాల్వలు, తూములు మరమ్మతులు చేయాలని అప్పుడే నీరు వృధా కాకుండా ఉంటుందని మరమ్మతులు చేయకపోతే రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులను సమీకరించి ఉద్యమాలు చేపడతామని మైనోద్దిన్ అన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనకు కృషి చేద్దాం

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా అదనపు ఎస్పి రమేష్ పిలుపునిచ్చారు. నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహించిన నషా ముక్త్ ర్యాలీని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా స్థానిక యువత, కళాశాల విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు.అనంతరం క్లాక్ టవర్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన భారీ ఎల్‌ఈడీ తెర ద్వారా రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా వర్చువల్ గా పాల్గొని యువత చేత మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పులిపాటి హేమలత మాట్లాడుతూ యువతే దేశ భవిష్యత్తు అని, అలాంటి యువత మత్తుకు బానిసలుగా మారితే దేశ అభివృద్ధి కుంటుపడుతుందన్నారు.ఈ కార్యక్రమంలో ఐబీసీ ఛానల్ ఎండీ ఏచూరి శైలజ,రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ బీమనపల్లి శ్రీకాంత్,కార్యదర్శి గుంటి రామకృష్ణ,కోశాధికారి కుంభం జ్యోతిరెడ్డి, సభ్యులు యాదగిరి,నన్నూరి లతాకుమారి,రామంజి రాజలింగం, డాక్టర్ పుల్లారావు, ప్రసాద్, పరమాత్మ, రిటైర్డ్ ప్రిన్సిపల్ లింగయ్య, ప్రభాకర్ రెడ్డి, ఎస్‌పిఆర్ పాఠశాల చైర్మన్ నన్నూరి రాంరెడ్డి పాల్గొన్నారు.



టిఎస్‌యూటిఎఫ్ డిండి మండల కమిటీ ఎన్నిక

ప్రజాపక్షం/డిండి; టీఎస్‌యూటీఎఫ్ డిండి మండల మహాసభ దేవరకొండలో బుధవారం జరిగింది. ఈ మహాసభలో మండల నూతన కమిటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా గండమళ్ళ రామారావు, ప్రధాన కార్యదర్శిగా నారోజు పవన్, ఉపాధ్యక్షులుగా హరిలాల్, సుజాత, కోశాధికారిగా ఖాజా రహమతుల్లా, ఎఫ్ డబ్ల్యూఎఫ్ కన్వీనర్‌గా అమరేందర్, మహిళా కన్వీనర్‌గా అరుణ, సోషల్ మీడియా కన్వీనర్‌గా సందీప్‌లు ఎన్నికయ్యారు. ఈ మహాసభకు రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశం, జిల్లా ఉపాధ్యక్షులు శేఖర్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులకు వెంటనే పిఆర్‌సి ప్రకటించి, పెండింగ్‌లో ఉన్న డిఎలను విడుదల చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నవంబర్ 1 ,2న కట్టంగూరులో జరిగే జిల్లా 7వ మహాసభలను విజయవంతం చేయాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు పూర్యా, రామలింగం, సరిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిపిఐ సినియర్ నాయకుడు నల్లవెల్లి రాంరెడ్డి మృతి బాధాకరం



ప్రజాపక్షం/డిండి; సిపిఐ సినియర్ నాయకులు కామ్రేడ్ నల్లవెల్లి రాంరెడ్డి బుధవారం మరణించారు. గురువారం రాంరెడ్డి స్వగ్రామం డిండి మండలంలోని కందుకూరులో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. కామ్రేడ్ రాంరెడ్డి కందుకూరు సిపిఐ గ్రామశాఖ కార్యదర్శిగా, పిఏసిఎస్ వైస్ చైర్మన్‌గా, నీటి సంఘం చైర్మన్‌గా పనిచేశారు. ప్రజానాట్యమండలిలో కళాకారునిగా అనేక బాధ్యతలు ఆయన నిర్వహించారు. రాంరెడ్డి మృతికి భారత కమ్యూనిస్టు పార్టీ దేవరకొండ నియోజకవర్గ సమితి పక్షాన పార్టీ శ్రేణులు సంతాపం తెలిపారు.

నాయి బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కొడిచెర్ల యాదగిరి



ప్రజాపక్షం/మర్రిగూడ : తెలంగాణ రాష్ట్ర నాయి బ్రాహ్మణ జనశక్తి సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మర్రిగూడ మండల కేంద్రానికి చెందిన కొడిచెర్ల యాదగిరి నియమితులయ్యారు.బుధవారం హైదరాబాద్ లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు పసుపుకుంట్ల వికాస్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నాయి బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి, సంఘం బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో కొడిచెర్ల రవి, జంపాల ప్రసాద్, దేవరకొండ సత్తయ్య, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలు మృతి



ప్రజాపక్షం/చౌటుప్పల్ : చౌటుప్పల్‌లోని అమ్మనాన్న అనాథ ఆశ్రమంలో ఓ వృద్ధురాలు బుధవారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండ జిల్లా సంక్షేమ అధికారి అనాథగా ఉన్న వెంకటరమణమ్మను రక్షించి సంరక్షణ కోసం చౌటుప్పల్‌లోని అమ్మనాన్న అనాథ ఆశ్రమంలో గత ఏడాది క్రితం తరలించారు. కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమె బుధవారం తెల్లవారుజామున మృతి చెందింది.ఈ ఘటనపై ఆశ్రమ ఉపాధ్యక్షులు సరిపల్లి గణేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ డి.సతీష్‌రెడ్డి తెలిపారు.